క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని తాడిగొట్ల గ్రామంలో బుధవారం గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా తిరుపతి వ్యవసాయ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ లావణ్య అధ్యక్షతన, వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఒసామాలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులు, వృద్ధులు, బాలింతలు, చిన్న పిల్లలు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పించారు. రోజువారి ఆహారంలో తప్పకుండా చిరుధాన్యాలు, పండ్లను చేర్చుకోవాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ లావణ్య మాట్లాడుతూ వేసవికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో ప్రతి ఒక్కరూ ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వైద్య సిబ్బంది మహమ్మద్ అలీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవీణ, ఏఎన్‌ఎం సుభాషిని, సునీత , వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకుని వెళుతున్న 'మేము సైతం' సభ్యులు

కడప అర్బన్: కడప శివారులో ఉన్న శ్రీ పద్మావతి వృద్ధాశ్రమంలో వెంకటమ్మ(60) అనే వృద్ధురాలు ఆశ్రమంలో 3 సంవత్సరాల నుండి ఆశ్రయం పొందుతూ అనారోగ్యంతో మరణించింది. ఆమెకు అంత్యక్రియలు చేసేందుకు బంధువులు ఎవరు లేకపోవడంతో, ఆశ్రమ నిర్వాహకులు రాంబాబు మేము సైతం సేవా సంస్థను సంప్రదించారు. ఆయన విజ్ఞప్తి మేరకు వెంకటమ్మకు మోచంపేటలోని హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వంకధారి రాము, రామరాజు, గురువయ్య, శివరాం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బ్యాంకు చైర్మన్‌ను భారతీయ మజ్దూర్ సంఘ్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు పత్రికాపరంగా చైర్మన్‌కు విన్నవించారు. కంప్యూటర్ ఇంక్రిమెంట్ అరియర్స్ విషయంలో నాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగులకు జరిగిన అన్యాయం గురించి గతంలో పలుమార్లు మేనేజ్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఒంటెద్దు పోకడల కారణంగా న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుతం కొంతమంది రిటైర్స్ నుంచి అరియర్స్ ఎక్కువ ఇచ్చామని రికవరీ పెట్టారని, మరి తక్కువ ఇచ్చిన వాళ్ల సంగతి ఏమిటన్నారు. ఒకే బ్యాచ్‌లో చేరి ఒకేసారి ప్రమోషన్ పొందినపుడు అరియర్స్‌లో ఎందుకు తేడా వచ్చాయన్నారు. సీజీబీలో 1993 నవంబరు 1 నుంచి కంప్యూటర్ ఇంక్రిమెంట్ ఉన్నదని, అప్పటి పర్సనల్ డిపార్టుమెంటు స్టాఫ్‌తో ఆంధ్రప్రగతి స్టాఫ్ అరియర్స్‌తిరిగి మొదటి నుంచి క్యాలిక్యులేట్ చేసి అందరికీ న్యాయం చేయాలన్నారు.

ఎంసెట్ పరీక్ష నిర్వహణపై అవగాహన



ఆన్‌లైన్‌లో కంప్యూటర్ మోడల్ పరీక్షను రాస్తున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో (అటానమస్) బుధవారం ఎంసెట్ మోడల్ కంప్యూటర్ పరీక్షను విద్యార్థులకు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ మోడల్ పరీక్షలో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కళాశాల చైర్మెన్ బి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో గత నెల రోజులుగా ఉచితంగా ఎంసెట్ కోచింగ్‌తోపాటు ఉచిత బస్సు సౌకర్యాన్ని కలిస్తూ శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులందరూ ఆన్‌లైన్ పరీక్షా విధానంపై అవగాహన పొందారని కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. కళాశాల ఏవో బాలక్రిష్ణ పర్యవేక్షణలో సివిల్ డిపార్టుమెంట్ విభాగాధిపతి నాగమల్లికార్జున ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు జరిగాయి.

మహా కుంభోత్సవం ప్రారంభం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి మాతకు బుధవారం కుంభాభిషేక కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. 12 సంవత్సరాల తర్వాత ఆలయ పునరుద్ధరణ కార్యక్రమాలనంతరం కుంభాభిషేక కార్యక్రమాలను వైభవోపేతంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఆర్యవైశ్య సంఘంతోపాటు ఆరు సంఘాల సేవా సంస్థలు ఉమ్మడిగా మహిళా సేవలతోసహా భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయంలో పుణ్యహవాచనం, ఆలయ శుద్ధి, ప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 50 మందికి పైగా రుత్వికులు వేదమంత్రోత్తంతో ఆలయ ప్రవేశం చేసి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. పండితులంతా ఒక్కసారిగా వేద మంత్రోచ్చాటన చేయడంతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి.

ప్రారంభమైన పూజలు..

మహాకుంభాభిషేక మహోత్సవంలో తొలి రోజు బుధవారం ఉదయం ప్రత్యేక పూజలను క్రమంగా చేపట్టారు. గంగానయనం, గోపూజ, కలశ స్థాపన, చండీపారాయణం, లక్ష్మీగణపతి వేద పారాయణంతోపాటు శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీ కోదండరామస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణ, నవావరణ మంత్రజపం, లక్ష కుంకుమార్చన, ఉదకశాంతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల నిర్వహణకు ఆర్యవైశ్య సంఘం ప్రముఖులందరూ పవిత్ర వస్త్ర ధారణలుచేసి కార్యక్రమాలకు హాజరయ్యారు. మహిళలతోపాటు పురుషులు సైతం పవిత్ర పూజల్లో పాల్గొన్నారు.



సర్వాంగసుందరంగా రూపుదిద్దుకున్న ఆలయం

నేటి కార్యక్రమాలు..

ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి వివిధ పూజలతోపాటు సాయంత్రం 7.00 గంటల నుంచి కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరు కానున్న విధుశేఖర భారతి స్వామి భక్తులతో అనుగ్రహ భాషణం చేస్తారు. రాత్రి శ్రీ చంద్రమౌళీశ్వర పూజలు నిర్వహిస్తారు.



విశేష అలంకారంలో శ్రీ వాసవీ కన్యకాంబ



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

కడప కార్పొరేషన్: కడప నగరం 14వ డివిజన్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వరసిద్ధి వినాయకస్వామి గుడి సమీపంలోని శ్రీ సీతా సమేత కోదండరామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకాష్‌నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ వాసుల చిరకాల వాంఛ ఇప్పటికి నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంత వాసులు రాముని పటం పెట్టుకొని కొన్ని ఏళ్లుగా పూజలు చేసేవారని, దేవాదాయ శాఖ ద్వారా కోటి రూపాయలు మంజూరు చేయించి ఆలయాన్ని నిర్మించామన్నారు. నగరంలోనే రాముని మందిరం ప్రసిద్ధికెక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీరాముని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కె. బాబు, 13వ డివిజన్ కార్పొరేటర్ ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ నాయక్, త్యాగరాజు, యల్లారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటక్రిష్ణ, అహ్మద్, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, బాబు, క్రిష్ణ, మురళీ పాల్గొన్నారు.



కోదండరామస్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

శ్రీ లలితాంబిక సన్నిధిలో విద్యార్థులకు శిక్షణ

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని శ్రీ చిన్మయ మిషన్ జిల్లా అధ్యక్షులు స్వామి తురియానంద ఆధ్వర్యంలో శ్రీ లలితాంబిక సన్నిధిలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ప్రత్యేకంగా నిర్వహించారు. స్వామిజీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి విద్యార్థులు, చిన్నారులకు ప్రత్యేక శిక్షణను ఇచ్చారు. ప్రధానంగా విద్యార్థులందరికీ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శారీరక, మానసిక ఆరోగ్యాలను అనుసంధిస్తూ ఈ కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం మాతృ దేవత పూజలు నిర్వహించారు. తల్లులను ఆహ్వానించి స్వయంగా చిన్నారులచే ప్రత్యేక పూజలు చేయించారు. చిన్నారులు తల్లుల పాదాలను కడిగి వారిని గౌరవించారు. అనంతరం పాలకొండల్లోని శ్రీ పాలకొండ్రాయస్వామి దర్శనానికి వెళ్లారు. అక్కడ సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు.



తల్లుల పాదాలు కడుగుతున్న చిన్నారులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చనలు, సర్పసూక్త పారాయణం, సమస్త పరివార దేవతా మూర్తుల హోమాలు మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, చక్రస్నానం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణుడు గరుడ వాహనంపై, సుబ్రహ్మణ్యస్వామి మయూర వాహనంపై మాడ వీధులతో ఊరేగారు. నిర్వాహకులు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. మహిళల కోలాటం, చెక్క భజన భక్తులను అలరించాయి.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

మండలంలోని రామాపురంలో జరుగుతున్న మోక్షనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 5 జతల కాండ్లు రాతి దూలాన్ని ఈడ్చాయి. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు. రూ.20వేలు, రూ.5వేల నగదు బహుమతులను అందజేశారు.

బండలాగుడు పోటీల్లో చౌటపల్లె ఎడ్లు ఫస్ట్

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ వృషభరాజముల బండలాగుడు పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎడ్లు 3527 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. ఆ ఎడ్ల యజమానికి ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి రూ.లక్ష పది కొండు వేలు నగదును అందించారు. ఈ పోటీలను ప్రొద్దుటూరు మండల మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డిలు ప్రారంభించారు. ఇందులో మొత్తం ఐదు జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈపోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ఆయా గ్రామ ప్రజలు, మహిళలు, పిల్లలు వచ్చారు. తెలంగాణ రాష్ట్రం హుజూర్ నగర్ బోరెడ్డి కేశవరెడ్డి, సుంకి సురేందర్ రెడ్డి ఎడ్లు 3499 అడుగులు లాగి రెండవ స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుంపురమానుదిన్నెకు చెందిన కుందురు రాంభూపాల్ రెడ్డి ఎడ్లు 2941 అడుగులు లాగి మూడో స్థానంలో, ఖాజీపేట మండలం పత్తూరు కవ్వ బాలయ్య ఎడ్లు 1543 అడులు లాగి నాల్గవ స్థానంలో, నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం ఇసుకపల్లె సిద్దయ్య ఎడ్లు 1500 అడుగుల లాగి ఐదవ స్థానంలో నిలిచాయి. వారికి వరుసగా రూ.75 వేలు, రూ.50 వేలు, రూ.30వేలు, రూ.20 వేలు ఆయా ఎడ్ల యజామనులకు నగదు బహుమతులు అందించారు. రాజుపాళెం ఎస్‌ఐ వెంకటరమణ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వల్లూరు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వల్లూరు, కమలాపురం ఎస్‌ఐలు పెద్దఓబన్న, విద్యాసాగర్ హెచ్చరించారు. మండలంలోని గణేష్‌పురం, వల్లూరు ఎస్సీ కాలనీల్లో బుధవారం వారు నాకా బందీ నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చైన్ స్నాచింగ్‌లతోపాటు గృహాల్లో దొంగతనాల నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పవళింపు సేవ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివారికి పవళింపు సేవ నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి పవళింపు సేవను వేద పండుతులు శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా గురువారం శాంతి ఉత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.



పవళింపు సేవలో అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవి

వైభవంగా రేణుకా ఎల్లమాంబ కల్యాణం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా యల్లమాంబ కల్యాణం బుధవారం వైభవోపేతంగా జరిగింది. అమ్మవారి తిరునాల సందర్భంగా బుధవారం సాయంత్రం చెన్నూరు మండలం శేషన్నగారిపల్లె గ్రామానికి చెందిన అనుగోలు చిన్న ఎల్లయ్య కుమారులు అనుగోలు మల్లికార్జున, ఎల్లప్రసాద్‌ల ఆధ్వర్యంలో శ్రీ జగజ్జనని శ్రీ రేణుకా ఎల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవమూర్తులకు వేదపండితులు రంగసముంద్ర మల్లికార్జునశర్మ, ప్రదీప్‌శర్మలు మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ క్రతువును జరిపారు. గ్రామ ప్రజలతో పాటు జిల్లా నలుమూల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూల విరాట్‌ను దర్శించుకొని కాయా కర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

దోమల నియంత్రణతోనే వ్యాధులను అరికట్టవచ్చు

చింతకొమ్మదిన్నె : దోమల నియంత్రణతోనే వ్యాధులను అరికట్టవచ్చునని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రక్తపరీక్షల విభాగాన్ని, రికార్డులను, రిపోర్టులను తనిఖీ చేసి గణాంకాలను పరిశీలించారు. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంవహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో నిర్దేశించిన మేరకు రక్త నమూనాల సేకరణ జరిపి పరీక్షల నిమిత్తం పంపాలని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులను గురించి అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మనం ఎక్కడ పడితే అక్కడ టీ కప్పులు, టెంకాయ చిప్పలు, పాత టయర్ల, ఉపయోగించని పాత్రలు అందులో వర్షపునీరు చేరి దోమలు గ్రుడ్లు పెడతాయని తెలిపారు. ఈ వ్యాధులను కలిగించే దోమలు నిల్వఉన్న నీటిలో ఒక్కసారి రెండువందల గుడ్లు పెడుతాయని అలానే తన జీవితకాలంలో వేయి నుండి రెండువేల గుడ్లు పెడతాయని అందువల్ల అవి గ్రుడ్లు పెట్టకుండా చేయగలిగితే మనం వాటిని ప్రాథమిక దశలోని నియంత్రించవచ్చు అన్నారు. గ్రామాల్లో మురికినీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడంవల్ల లార్వాల గాలిగొట్టం మూసుకుపోయి లార్వాలు మరణిస్తాయని తెలిపారు.

వెల్లాలలో వైభవంగా తిరుణాల



వెల్లాల తిరుణాలకు హాజరైన జనసందోహం

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవం (తిరుణాల) అంగరంగ వైభవంగా జరిగింది. సాంప్రదాయ బద్ధంగా వేద పండితులు హోమం నిర్వహించి, పూజలు చేసి స్వామివారి రథంను దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్, ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి టెంకాయలు కొట్టి ప్రారంభించారు. ముందుగా తిరునాలకు వచ్చిన కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించి కుందూనదిలో స్నానాలు చేశారు. వివిధ రకాల బొమ్మల అంగళ్ల ఏర్పాటు చేయడంతో ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకుంది. పెద్దసంఖ్యలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వాములను దర్శించుకున్న అనంతరం పిల్లలతో కలిసి ఆనందంగా తిరిగారు. స్వాముల వారిని మాజీ జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ట్రైనీ డీఎస్పీ భవాని, త్రీ టౌన్ సీఐ గోవింద రెడ్డి, ఎస్‌లు వెంకటరమణ, శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, ఆయా గ్రామాల్లోని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథం వద్దకు కొంతమంది మహిళలు బోనాలు సమర్పించిన అనంతరం రథాన్ని ముందుకు కదిలించారు. అర్చకులు మాధవాచార్యులు, పట్టాభిరామన్, వెంకటా చలపతి, పవన్, శేషాచార్యులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికందర్ హుస్సైన్

కడప ఎడ్యుకేషన్: మాదకద్రవ్యాలతో వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ బంధాలు దెబ్బతినడంతోపాటు సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికందర్ హుస్సైన్ అన్నారు. బుధవారం కడప ప్రభుత్వ ఐటీఐ మైనార్టీ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యసనాలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలు మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ నయన కుమార్, హెడ్ కోఆర్డినేటర్ సెల్వకుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



చిన్నారులకు టవళ్లు పంపిణీ చేస్తున్న పాస్టర్

కడప కల్చరల్ : వేసవి సమయంలో పిల్లల పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉందని, పసి బిడ్డల సంరక్షణలో ఎలాంటి అలక్ష్యం వహించరాదని పాస్టర్ మహేష్ అన్నారు. స్థానిక కృపా కాలనీలోని న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేద విద్యార్థులకు దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవితేజ, శాంతిరాజు, రోజా, నరసయ్య, అల్లూరమ్మ, సుంకమ్మ, అంజినమ్మ, అంజలి, సుగుణమ్మ, దూపం మహేష్ అనేక మంది తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరై పిల్లలు ప్రమాదాలకు గురి కాకూడదని అందరిపై ఏసుక్రీస్తు ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి అఫ్సన్‌తో కేక్ కట్ చేపిస్తున్న పాఠశాల డైరెక్టర్ వివేకానందరెడ్డి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో కడప ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. పదవ తరగతికి సంబంధించి పాఠశాలలో 60 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి తెలిపారు. ఐటీ విభాగంలో రాయలసీమ వ్యాప్తంగా అఫ్సన్ అనే విద్యార్థిని 600 మార్కులకు గాను 557 మార్కులను సాధించి భలా అనిపించిందన్నారు. జిల్లా టాపర్‌గా నిలిచిన ఎస్. అఫ్సన్ కడప ఏసీబీ సీఐ సయ్యద్ హాసం కుమార్తె అని డైరెక్టర్ వివేకానంద రెడ్డి తెలిపారు. జిల్లా టాపర్‌తో పాటు ప్రతిభ కనబర్చిన విద్యార్థిని,విద్యార్థులను ఆయన అభినందించారు. అలాగే పాఠశాలలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హరికృష్ణ, ఇంచార్జ్ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

వల్లూరు : మండలంలోని తప్పెట్ల బ్రిడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబాఫక్రుద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీలోని ధర్మాపురం కాలనీకి చెందిన బాబాఫక్రుద్దీన్ ద్విచక్ర వాహనంలో కడప కు వెళుతుండగా కడప వైపు నుంచి వస్తున్న లారీ తప్పెట్ల బ్రిడ్జి వద్ద యువకుడి కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు బాధితుడిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు.